సాక్షి
శ్రీకాకుళం

సోమవారం ၊ 6 ၊ నవంబర్ ၊ 2023



వెలుగులు నింపాలి

దీపావళికి జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. దీనిపై జిల్లా అగ్నిమాపక శాఖాధికారి సూచనలు.

- 8లో



పెళ్లయిన రెండు నెలలకే..

పెళ్లయిన రెండు నెలలకే ఓ యువతి మృతి చెందింది. జి.సిగడాం మండలంలో ఘటన జరిగింది.

- 8లో

పోటెత్తిన భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఒక్కరోజులో వివిధ దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2.44.300, విరాళాల రూపంలో రూ.1.07.003, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.90 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లుగా ఈఓ తెలిపారు.

సైడ్‌లైట్స్

అడుగులన్నీ అటువైపే..



కాశీబుగ్గలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు పలు ప్రాంతాల నుంచి మహిళలు కాలినడకన వచ్చారు. రెండు, మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ.. పార్టీపై ఉన్న అభిమానంతో సమావేశానికి తరలివెళ్లారు.

ఆట..పాట



బహిరంగ సభకు వచ్చిన జనాలను చూసి మంత్రి అప్పలరాజు మురిసిపోయారు. మైక్ తీసుకుని ఉత్సాహంగా జగనన్నే మానమ్మకం .. జగనన్నే మా ధైర్యం అంటూ చిందేస్తూ పాటందుకున్నారు. ఆయన సతీమణి శ్రీదేవి కూడా స్వరం కలపడంతో పార్టీ నాయకులు జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.

దీక్షగా శ్రవణం



సామాజిక సాధికార యాత్రలో అయ్యప్ప స్వాములు ప్రత్యేకంగా కనిపించారు. సమావేశానికి వచ్చిన స్వాములను వేదికపై ఉన్న నిర్వాహకులు ప్రత్యేకంగా కుర్చీలు వేసి, కూర్చోవాలని కోరారు. దీంతో వారంతా సమావేశం పూర్తయ్యేవరకు ఉన్నారు. ప్రముఖుల ప్రసంగాలను ఎంతో ఓపికగా విన్నారు.

సభకు కొత్త 'కళ'



కాశీబుగ్గలోని వైఎస్సార్ స్క్వేర్ వద్ద జరిగి బహిరంగ సభలో తప్పెటగుళ్లు, జానపద నృత్యం, కూచిపూడి నాట్యాలు ఆకట్టుకున్నాయి. వీటికి తోడు పార్టీ పాటలు కూడా తోడు కావడంతో సభా ప్రాంగణం కళగా కనిపించింది.

'బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం'



పాట పాడుతున్న వంగపండు ఉష

మందస: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక విభాగం కన్వీనర్ వంగపండు ఉష అన్నారు. కాశీబుగ్గలోని వైఎస్సార్ స్క్వేర్ వద్ద ఆదివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు దోచుకుతిన్నాయని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. పథకాలు నేరుగా ప్రజలకే అందుతున్నాయన్నారు. చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. తప్పు చేస్తే కదా జైలుకు వెళ్లారు.. అక్కడ సకల సదుపాయాలు కల్పించాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. అనారోగ్యం పేరిట బయటకు వచ్చిన ఆయన మళ్లీ రాజకీయ నాటకాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె తన బృందంతో ఆట పాటలతో ఉర్రూతలూగించారు.



పలాసలో బహిరంగ సభకు హాజరైన ప్రజానీకంలో ఓ భాగం
(ఇన్‌సెట్లో) వేదికపై ప్రజా ప్రతినిధులు



ఇది సామాన్యుడి గర్జన.. ఇది సామాజిక గర్జన.. వేదిక ప్రజా ప్రతినిధులదే అయినా వేడుక మాత్రం పేదోడిది. ఎల్లమ్మ జాతర మళ్లీ చూసినట్టు, పల్లెతల్లి ఇంట పేరంటం జరిగినట్టు పలాసలో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్రకు జనం వెల్లువలా తరలివచ్చారు. నాలుగున్నరేళ్ల పాలన గురించి అమాత్యులు గుండె విప్పి ప్రసంగిస్తే.. పొందిన మేలును తలచుకుని ప్రజలు చప్పట్లతో ప్రశంసించారు. నాయకుల ర్యాలీకి మద్దతు తెలిపి, సభను ఆసాంతం వీక్షించి, మంత్రుల ప్రసంగాలను ఆలకించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఉద్యమాల గడ్డపై సామాజిక గర్జన

- వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు జన నీరాజనం
- కిక్కిరిసిన పలాస- కాశీబుగ్గ దారులు
- ఉద్వేగంగా ప్రసంగించిన స్పీకర్, మంత్రులు
- చేసిన మంచిని వివరించిన ప్రజా ప్రతినిధులు

కాశీబుగ్గ/పలాస/మందస/వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్: మూడు సెలయేళ్లు సముద్రంలో కలిసినట్టు పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల ప్రజలు ఆదివారం వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు హాజరయ్యారు. గ్రామాల నుంచి ఎవరి తోచిన విధంగా బస్సులు, ఆటోలు, బైకుల్లో తండోపతండాలుగా తరలివచ్చారు. కోసంగిపురం కూడలి వద్ద బైక్‌ర్యాలీకి కాశీబుగ్గ ముస్లిం సోదరులు స్వాగతం పలికారు. ఉద్యమాల పురిటి గెడ్డ ఉద్దానం ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున యువకులు, మహిళలు యాత్రలో భాగస్వాములై సంఘీభావం తెలిపారు. బస్సుతో పాటు మంత్రుల కాన్వాయ్‌కు స్వాగతం పలకడానికి జాతీయ రహదారి వద్ద గల కోసంగిపురం కూడలి వద్దకు బైక్‌లతో వేలాదిగా జనం వెళ్లారు. కాశీబుగ్గ పెట్రోలు బంకు నుంచి కోసంగిపురం కూడలి వరకు సుమారు రెండు కిలోమీటర్లు వాహనాలు బారులు తీరాయి. కాశీబుగ్గ పోలీసులు ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. సుమారు 3.45 గంటలకు సామాజిక బస్సు యాత్ర అక్కడకు చేరుకోగా ముందుగా బైక్ ర్యాలీ సాగింది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్తుండగా వారి వెనుక అనేక వాహనాల శ్రేణి అనుసరించింది. వంగపండు ప్రసాదరావు కుమార్తె వంగపండు ఉష బృంద కళాకారులు తమ ఆటపాటలతో మంత్రులను ప్రజాప్రతినిధులనే కాకుండా అశేష ప్రజానీకాన్ని ఉర్రూతలూగించారు. ఓ పక్క ఈ కార్యక్రమం సాగుతుండగానే మరో పక్క వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వేదిక వద్దకు వెళ్లి ప్రసంగించారు. సుమారు నాలుగు గంటల పాటు జరిగిన కార్యక్రమాలను ప్రజలు ఆసక్తిగా గమనించారు. జై జగనన్న నినాదాలతో హోరెత్తించారు.



సాధికార యాత్ర బస్సు వద్ద పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ కర్త వైవీ సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, వరుదు కల్యాణి, నర్తు రామారావు, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, గొర్లె కిరణ్‌కుమార్, కంబాల జోగులు, రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరి బాబు, జెడ్పీటీసీ పాలిన శ్రావణి, ఎచ్చెర్ల జెడ్పీటీసీ బల్లాడ హేమమాలినీ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, హనుమంతు వెంకటరావుదొర, డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్, నర్తు నరేంద్ర, హనుమంతు వెంకటరావు, చింతాడ మంజు తదితరులు పాల్గొన్నారు.



అప్పలరాజుని గెలిపించాలి

పలాస ప్రజలు నమ్మకమైన వారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిని చూసి ఎవరినైనా గెలిపిస్తారు. డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ ప్రాంత అభివృద్ధికి అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ వద్ద కూడా సీదిరికి మంచిపేరు ఉంది. ఉద్దానం అభివృద్ధికి బాటలు వేసిన అప్పలరాజును వచ్చే ఎన్నికల్లో పెద్ద మెజారిటీతో గెలిపించాలి. టీడీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలి.

– తమ్మినేని సీతారాం, స్పీకర్



కష్టాలు చూశారు..

సుదీర్ఘ పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్ ఇక్కడి ప్రజల కష్టాలను కళ్లారా చూశారు. కిడ్నీరోగులు తమ కష్టాలు చెప్పుకుంటే చలించిపోయి తాను అధికారంలోకి రాగానే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పలాసలో 200 పడకల కిడ్నీ ఆస్పత్రిని నిర్మించారు. గత పాలకులు కష్టాలు చూశారే తప్ప ఏమీ చేయలేదు. సీఎం వైఎస్ జగన్ మాత్రమే పనులు చేసి చూపించారు. భవిష్యత్ తరాలకు ఈ వ్యాధి సోకకూడదనే ఆలోచనతో రూ.700 కోట్లతో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టును ఏర్పా టు చేశారు. ఈనెల 23న సీఎం వైఎస్ జగన్ ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. దీన్ని తట్టుకోలేక టీడీపీ నాయకులు పిచ్చి ప్రేలాపన చేస్తున్నారు. జిల్లా టీడీపీ నాయకులకు దమ్ముంటే జిల్లాకు ఏం చేశారో చెప్పాలి. జిల్లాలో వలసలు నివారించడానికి మూలపేటలో పోర్టు నిర్మిస్తున్నాం. వంశధార ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోవడం బాధాకరం. ఆయకట్టు ప్రాంతంలో పంట నష్టం అంచనా వేసి ప్రతి రైతుకు నష్టపరిహారాన్ని అందించి న్యాయం చేస్తాం.

– సీదిరి అప్పలరాజు, మంత్రి



ఒక్క సంస్థనైనా తెచ్చారా..?

2014లో చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి ఒక్క సంస్థను కూడా శ్రీకాకుళం తీసుకురాలేకపోయారు. మన జిల్లాలో ప్రజలు ప్రతిసారీ టీడీపీ నాయకులను గెలిపిస్తుంటారు. కానీ ఆ పార్టీ నేతలు చెప్పుకోదగ్గ ఒక్క మంచి పని కూడా చేయలేదు. 1985 అనంతరం జిల్లాకు ఏం చేశారో టీడీపీ నాయకులు చెప్పాలి. శ్రీకాకుళం ఉద్యమాల పురిటి గడ్డ. కానీ ఎలాంటి ఉద్యమాలు జరగకుండానే ఇక్కడ కిడ్నీరీసెర్చ్ సెంటర్, వాటర్ గ్రిడ్ వంటివి నిర్మించి సీఎం వైఎస్ జగన్ జిల్లాపై తనకు ఉన్న ప్రేమను చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన మొదలవ్వగానే.. తన మీడియా వ్యవస్థ, ధన బలంతో తొక్కేద్దాం అని బాబు అనుకున్నారు. కానీ జగన్ ముందు ఆయన పప్పులు ఉడకలేదు. ఎన్నికల ముందు మళ్లీ మాయ చేసేందుకు బాబు అండ్‌కో వస్తారు. జనమే బుద్ధి చెప్పాలి.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి



జాతీయ రహదారిపై సాధికార యాత్ర బస్సు, మంత్రుల కాన్వాయ్

టెక్కలి గెలుపును కానుకగా ఇద్దాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

టెక్కలి: వెనుకబడినవర్గాలకు సామాజిక గౌరవం, హోదా ఇచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. టెక్కలి గెలుపును ఆయనకు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు ఆదివారం టెక్కలిలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అధ్యక్షతన పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేశారని మళ్లీ ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జిల్లాను అభివృద్ధి చేస్తున్నారని కృష్ణదాస్ పేర్కొన్నారు. మూలపేట పోర్టు, ఆఫ్‌షోర్ పూర్తి చేయడానికి నిధులు, పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రం, ఉద్దానం ప్రాంతానికి శుద్ధజలం అందించే



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్. చిత్రంలో దువ్వాడ వాణి, పేరాడ తిలక్, కృపారాణి, సూరిబాబు తదితరులు

ప్రాజెక్టులు సీఎం వైఎస్ జగన్ చలవేనని అన్నారు. అనంతరం టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి మాట్లాడుతూ.. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్వప్నాన్ని సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారని తెలిపారు. ప్రతి గడపకూ నాయకులను పంపిస్తూ ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తున్నారని అన్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నడూ గుర్తించని విధంగా బీసీ కులాలను గుర్తించి కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సుమారు 139 సామాజిక వర్గాలకు 56 కార్పొరేషన్లతో సామాజిక హోదా కల్పించారని వెల్లడించారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ దేశం మొత్తం చూసే విధంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ట్రెండ్ సృష్టిస్తున్నారని అన్నారు. మాజీ సీఎం నారా చంద్రబాబు బీసీ వర్గాలతో హీనంగా మాట్లాడారని గుర్తు చేశారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కళింగపట్నం కృష్ణారావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, రాజాపు హైమావతి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రీజనల్ ఇన్‌చార్జి బెందాళం పద్మావతి, నాయకులు కరిమి రాజేశ్వరరావు, సంపతిరావు రాఘవరావు, పాల వసంత్‌రెడ్డి, కె.గోవింద్, దువ్వాడ హైందవి, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పలాసలో అభిమాన నాయకులకు మహిళల అభివాదం



టెక్కలిలో బస్సు యాత్రకు మద్దతుగా బైక్ ర్యాలీ



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి బొత్స, చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి, సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాస్ తదితరులు



బైక్‌పై యాత్రకు..

క్లుప్తంగా

అలరించిన 'సురభి' మాయాబజార్



మాయాబజార్ నాటకంలో ఓ సన్నివేశం

అరసవల్లి: ఆదిత్యుని సన్నిధిలో ఆదివారం సాయంత్రం ధర్మపథంలో భాగంగా అలనాటి పౌరాణిక అద్భుతం మాయాబజార్ నాటకం అందరినీ అలరించింది. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మపరిషత్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ 'సురభి' థియేటర్స్, శ్రీవినాయక నాట్యమండలి సంయుక్తంగా నిర్వహించిన నాటికలో కళాకారులు అద్భుతంగా నటించారు. ఇంద్రపుష్కరిణి ఆవరణలోని వైజయంతి ఉత్సవ వేదికపై జరిగిన ఈ కార్యక్రమంలో ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు ఎస్.కోటేశ్వర చౌదరి, నిర్వాహక ప్రతినిధులు చంద్రమౌళేశ్వర శర్మ, లలితామణి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు. పౌరాణికం అనంతరం కళాకారులను సత్కరించారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు



చంద్రయ్యతో మాట్లాడుతున్న పోలీసులు

కంచిలి : కుటుంబ గొడవ కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు వెళుతున్న వ్యక్తిని కంచిలి పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళితే.. సోంపేట మండలం ఇసుకలపాలెం గ్రామానికి చెందిన గనగల్ల చంద్రయ్య భార్యతో ఘర్షణపడి సోంపేట నుంచి ఆటోలో వచ్చి కంచిలి రైల్వే ఫ్లైఓవర్ వద్ద దిగాడు. ఆటో డ్రైవర్‌కు ఫోన్ అడిగి కుమార్తెకు ఫోన్ చేసి తాను రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నాని చెప్పాడు. ఈ విషయం విన్న ఆటో డ్రైవర్ వెంటనే కంచిలి వచ్చి హెడ్ కానిస్టేబుల్ కోరాడ ఈశ్వరరావు, కానిస్టేబుల్ నర్సు చంద్రయ్యలకు చెప్పాడు. దీంతో వారు వెంటనే రైల్వే స్టేషన్‌కు వెళ్లి ట్రాక్ మీదుగా సోంపేట వైపు వెళ్లారు. వీరిని చూసి చంద్రయ్య పారిపోబోయాడు. అతడ్ని వెంబడించి కౌన్సిలింగ్ ఇచ్చి ప్రాణాలను కాపాడారు. సురక్షితంగా ఇంటికి వెళ్లేలా ఒప్పించారు. వ్యక్తిని ఆత్మహత్యా ప్రయత్నం నుంచి తప్పించిన పోలీసులను ఎస్ఐ ఎస్.బాలరాజు, సిబ్బంది అభినందించారు.


పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రకాశరావు

శ్రీకాకుళం కల్చరల్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు కోరారు. స్థానిక శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో ఆదివారం జిల్లా స్థాయి ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంఘం సహకారంతో చీఫ్ సెక్రటరీని, ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి ప్రతి నెలా ఒకటో తేదీనాటికే పెన్షన్ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాత్రమే లైఫ్ సర్టిఫికెట్లు ట్రెజరీకి సమర్పించాలని, ముందుగా చెల్లిస్తే పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్ర సంఘానికి ఉపాధ్యక్షునిగా ఎన్నికైన ప్రకాశరావును సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పి.నరసింహమూర్తి, గౌరవాధ్యక్షుడు డి.వి.ఎస్.ఆచారి, ప్రతినిధులు కె.సోమసుందరరావు, చంద్రశేఖరరావు, సత్యనారాయణ, ప్రభాకరరావు, మృత్యుంజయరావు, పీఎస్ ప్రసాదరావు, నరసింహులునాయుడు, ఝాన్సీరాణి, జయలక్ష్మి, నరసమ్మ పాల్గొన్నారు.

బుడుమూరు రాజేష్‌కు సన్మానం



రాజేష్‌ను సన్మానిస్తున్న లాకా వెంగళరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్‌ను జేఎన్‌టీయూజీవీ సిండికేట్ మెంబర్‌గా ప్రభుత్వం ఇటీవల నామినేట్ చేసిన నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరావు ఆదివారం విశాఖపట్నంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. రాజేష్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు, కార్యదర్శి బాడాన దేవభూషణ్, పిట్ట భాగ్యచంద్ర, సురేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీకట్లు కాదు..

వెలుగులు నింపాలి

సాక్షి ఇంటర్వ్యూ



జడ్డు మోహనరావు, అగ్నిమాపక అధికారి, శ్రీకాకుళం జిల్లా

- దీపావళి నాడు జాగ్రత్తలు పాటించాలి
- బాణసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి
- పెద్దల సమక్షంలోనే పిల్లలు క్రాకర్స్ కాల్చాలి
- గ్రీన్‌కాకర్స్‌తోనే పర్యావరణానికి మేలు
- సాక్షితో జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జడ్డు మోహనరావు

శ్రీకాకుళం క్రైమ్ : మనందరికీ ఇష్టమైన దీపావళి పండగ మరికొన్ని రోజుల్లో రానుంది. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ సంతోషంగా బాణసంచా కాల్చుతూ పండగ జరుపుకుంటారు. ఈ సమయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా తీవ్ర నష్టం తప్పదు. ముఖ్యంగా పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు తక్కువ. ఈ నేపథ్యంలో పండగ పూట తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జిల్లాలో బాణసంచా విక్రయించే షాపులు, అనుమతులపై జిల్లా జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జడ్డు మోహనరావు 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: బాణసంచా అమ్మకాలకు పర్మినెంటు షాపులు ఎన్ని ఉన్నాయి?

అధికారి: జిల్లా కేంద్రం పరిధిలో రెండు, చల్లపేటలో ఒకటి ఉన్నాయి.

సాక్షి: తాత్కాలిక షాపులకు ఎటువంటి అనుమతులు అవసరం?

అధికారి : ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుంటే సబ్ డివిజనల్ డీఎస్పీ, డీఎంహెచ్‌వో ద్వారా అగ్నిమాపక శాఖకు పంపిస్తారు. నిబంధనలకు అనుగుణంగా ఉంటే రూ. 500 చెల్లించి నిరంభ్యంతర పత్రం (టెంపరరీ లైసెన్సు) పొందవచ్చు.

సాక్షి: ఎలాంటి నిబంధనలు పాటించాలి?

అధికారి : తారాజువ్వలు, సిసింద్రీలు తదితర మందుగుండు సామగ్రిని లైసెన్సు లేకుండా తయారు చేయకూడదు. రేకులతో షెడ్ నిర్మించాలి. ఒక్కో దుకాణానికి మధ్య కనీసం మూడు అడుగుల ఖాళీ ఉండాలి. వాటర్ ట్యాంకు అందుబాటులో ఉంచాలి. డ్రమ్ములు దగ్గర పెట్టుకోవాలి. రెండు, మూడు ఇసుక బకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలి.

సాక్షి: జిల్లా ప్రజలకు ఇచ్చే సందేశం?

అధికారి : దీపావళి పండగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలి.

సాక్షి: బాణసంచా కాల్చినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి?

అధికారి : నాణ్యమైన కంపెనీలు తయారు చేసిన బాణాసంచాను మాత్రమే కొనుగోలు చేయాలి. అవగాహన లేని నాసిరనాకి వాడితే ప్రమాదాలు జరిగే అవకాశమెక్కువ.

- వేగంగా కాలే స్వభావం కలిగిన మందుగుండు సామగ్రిని ఇళ్లలో నిల్వ ఉంచరాదు. కిరోసిన్, పెట్రోల్, గ్యాస్ నిల్వ చేసే గదులు, వంట గదుల్లో మందుగుండు సామగ్రి నిల్వ ఉంచకూడదు. ముఖ్యంగా చిన్నారులతో కాకర్లు, మందుగుండు సామగ్రి కాల్చినప్పుడు పొడవాటి కర్రకు కట్టారు. అలా చేయడం వల్ల అగ్ని రేణువులు కళ్లు, దుస్తులపై పడకుండా ఉంటుంది.
- ఇంట్లో కొందరు పిల్లలు అన్నకు తెలియకుండా తమ్ముడు.. తమ్ముడికి తెలియకుండా అన్నా.. దాచుకుని ఇళ్లల్లోనే కాల్చేస్తుంటారు. అందువల్ల పిల్లలకు అందని ప్రదేశాల్లో పెట్టాలి.
- కొందరు బయట సగం కాలి పేలనివి ఏరుకుని మళ్లీ కాల్చుతుంటారు. అలాంటప్పుడు ప్రమాదాలు జరుగుతాయి.
- కాటన్ దుస్తులు ధరించాలి. నైలాన్, పాలిస్టర్ దుస్తులు ధరించరాదు.
- మందుగుండు సామగ్రి కాల్చినప్పుడు సమీపంలో నీళ్లు, ఇసుక నిల్వ ఉంచుకోవాలి. కాళ్లకు పాదరక్షలు ధరించాలి. కళ్లద్దాలు ధరించాలి.
- ఆరుబయట పూరిళ్లు లేని ప్రాంతాల్లో కాల్చడం శ్రేయస్కరం.
- టపాసులు కాల్చేటప్పుడు సిగరెట్లు, బీడీలు కాల్చరాదు.
- మందుగుండు సామగ్రి కాల్చినప్పుడు రోగులు, వృద్ధులు, పసిపిల్లలు, గర్భిణులు దూరంగా ఉండాలి.
- దుస్తులకు నిప్పు అంటుకున్నట్లయితే పరిగెత్తకూడదు. దుప్పటితో చుట్టుకోవాలి. కాలిన భాగంపై చల్లటి నీరు (ఐస్‌వాటర్) పోస్తే మంచిది. శరీరంపై జీవకణాలు చనిపోకుండా ఉంటాయి. ఎటువంటి వేపనాలు రాయకూడదు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

సాక్షి: ప్రమాదం సంభవిస్తే..?

టపాకాయలు కాల్చినప్పుడు అగ్నిప్రమాదం సంభవిస్తే తక్షణమే 101 నంబర్ ద్వారా అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించాలి.

జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు

- శ్రీకాకుళం 08942222099,
- రణస్థలం 08942234499,
- టెక్కలి 08945244277,
- ఇచ్ఛాపురం 08947231101,
- నరసన్నపేట 08942276777,
- కోటబొమ్మాళి 08942238659,
- సోంపేట 08947234101,
- ఆమదాలవలస 08942286401,
- పొందూరు 08941242101,
- పలాస 08945241101,
- కొత్తూరు 08946258444,
- మందస 08947237101లకు కూడా తెలియజేయవచ్చు.

కార్గో రెవెన్యూ పెంపునకు కృషి

- ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి



కార్గో కార్యాలయం వద్ద కలాసీలతో మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీకాకుళం అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీలో భాగమైన కార్గో రవాణా ఆదాయం పెంపునకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో ఆదాయం పెంచేందుకు కార్గో డెవలప్‌మెంట్ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలలో పర్యటించి కార్గో ఆదాయం పెంచేందుకు ఉన్న మార్గాలను అధ్యయనం చేసి నివేదికను పీటీడీ కమిషనర్‌కు అందజేస్తుందన్నారు. 2023–2024 సంవత్సరానికి రూ.240 కోట్లు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. 2024–2025 సంవత్సరానికి రూ.500 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమలు, సముద్రమార్గం, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులకు, మందులకు అవకాశం ఉన్నందున ఆదాయం పెంచేందుకు కృషిచేద్దామన్నారు. వాణిజ్య సంబంధిత పార్శిల్స్‌ను కూడా సురక్షితంగా, వేగవంతంగా తక్కువ ధరలకే ఇంటి వద్దకే చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పీటీడీ ఉద్యోగులుగా మనమంతా ధర్నాలకు, నిరసనలకు దూరంగా ఉండి నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఆర్టీసీ ఉద్యోగులకు కూడా జీపీఎస్ వ్యవస్థ అమలు చేసేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. డీపీటీవో ఎ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజారెడ్డి ఆర్టీసీలో 35 సంవత్సరాలు ఉద్యోగిగా పనిచేశారని, సిబ్బంది కష్టనష్టాలు తెలుసని చెప్పారు. కర్నూలు డీసీటీఎం రమణ మాట్లాడుతూ అందరి సమన్వయంతోనే లక్ష్యం సాధించగలమన్నారు. అనంతరం శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు పి.మల్లికార్జునరాజు, కేఆర్ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, టెక్కలి డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, పలాస డిపో మేనేజర్ ఆర్ఎస్ నాయుడు, ఎస్ఎం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నాటికగా 'ఓ మనిషి కావాలి'



వైఎస్ఆర్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న దృశ్యం



ఓ మనిషి కావాలి నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఒక మనిషికి మరోమనిషి సాయం చేయడం ఇచ్చిపుచ్చుకోవడం మానవతా ధర్మమని తెలియచేసే నాటిక 'ఓ మనిషి కావాలి'. నెల్లూరు క్రాంతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఈ నాటికను జస్టిస్ డాక్టర్ గురుగుబెల్లి యతిరాజులు సౌజన్యంతో ప్రదర్శించారు. రచన పనసాల, దర్శకత్వం తంబు సురేష్‌బాబు, సంగీతం లీలామోహన్ అందించారు. యువత ఉద్యోగాలు లేక మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను ఏవిధంగా నాశనం చేసుకుంటున్నారో తెలియచేసే ఇతివృత్తంతో కత్రిపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో 'విముక్తి' నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. 1965–66 మున్సిపల్ హైస్కూల్, శ్రీకాకుళం పూర్వ విద్యార్థులు సౌజన్యంతో ప్రదర్శించిన ఈ నాటికకు రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వహించారు.

విజేతలు వీరే..

నెల్లూరుకు చెందిన క్రాంతి ఆర్ట్ థియేటర్స్ ప్రదర్శించిన 'ఓ మనిషి కావాలి' ప్రథమ, సుకృతి క్రియేషన్స్ 'మిణుగురు వెలుగులు' ద్వితీయ, ఉషోదయా కళానికేతన్ 'విముక్తి' తృతీయ స్థానాల్లో నిలిచి వరుసుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు పురస్కారాలు గెలుచుకున్నాయి. పౌరాణిక నటుడు పద్మశ్రీ యడ్ల గోపాలరావు, ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్తుల సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామరావు, నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి జ్ఞాపికలు అందించారు. ఉత్తమ నటుడుగా ఎ.సూర్య(మిణుగురు వెలుగులు), ఉత్తమ నటిగా ఎస్.జ్యోతి(ఓ మనిషి కావాలి), ఉత్తమ దర్శకుడిగా కె.వి.రంగారావు,(మిణుగురు వెలుగులు) అవార్డులు అందుకున్నారు. అట్టాడ అప్పలనాయుడు, జి.ఎస్.ప్రసాద్‌రెడ్డి, గంటా కల్యాణ్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం వైఎస్ఆర్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలు యడ్ల గోపాలరావు, అట్టాడ అప్పలనాయుడు, కోన సన్యాసిలను సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వేంకటరావు, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, మంతిన వాసుదేవాచారి, అగతమూడి సింహాచలం, కంచరాన అప్పారావు, పి.ఎం.జె.బాబు, బి.ఎం.ఎస్ పట్నాయిక్, శాంతారావు పాల్గొన్నారు.

సత్యసాయి సభ్యుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సత్యసాయి యువజన విభాగం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా జయంతి వేడుకల సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల యువజన విభాగం ఆధ్వర్యంలో బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ సహకారంతో సత్యసాయి సేవా సంస్థల సమన్వయకర్త సూర రామచంద్రరావు, యువజన విభాగం సమన్వయకర్త శివకుమార్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 10 రక్తదాన శిబిరాలు నిర్వహించామని, ఈ నెల 7న కోటబొమ్మాళి మందిరంలో 11వ రక్తదాన శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. సాయిలిక్విడ్ లవ్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బృందావనం కన్వీనర్ ఎ.ప్రసాదరావు, జోనల్ కన్వీనర్ పప్పల నాగేశ్వరరావు, నేషనల్ నారాయణ సేవ ఇన్‌చార్జి అప్పారావు, బోయిన నరసింహమూర్తి, షణ్ముఖ, శేఖర్, చరణ్, అప్పలరాజు, సుజాత, ప్రమీల బ్లడ్ బ్యాంకు మణికంత తదితరులు పాల్గొన్నారు.

తల్లి రుణం తీర్చుకున్న తనయ



తల్లికి తలకొరివి పెడుతున్న కుమార్తె వరలక్ష్మి

ఇచ్ఛాపురం రూరల్: కన్న కూతురే అన్నీ తానై కన్నతల్లికి తలకొరివి పెట్టిన సంఘటన ఇచ్ఛాపురం మండలంలో నెలకొంది. కేశుపురం గ్రామానికి చెందిన బుడత సావిత్రి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కుమారుడు బూలోకు అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతుండటంతో తల్లి దహన సంస్కారాలకు రాలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో చిన్న కుమార్తె బుడత వరలక్ష్మీ తన తల్లికి తలకొరివి పెట్టేందుకు ముందుకు వచ్చి అంత్యక్రియలు పూర్తి చేసింది.

వెల్లివిరిసిన స్నేహబంధం



మురళి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న మిత్ర బృందం

ఇచ్ఛాపురం రూరల్: తమతో చదివిన చిన్ననాటి మిత్రుడు అనారోగ్యంతో అకాల మృతి చెందాడన్న విషయం తెలుసుకుని పూర్వ విద్యార్థులు చలించిపోయారు. స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకొని బృందంగా ఏర్పడి నగదును సేకరించి కుటుంబానికి అందజేశారు. ఇచ్ఛాపురం మండలం బిర్లంగి తోటూరు గ్రామానికి చెందిన జోగల మురళీ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. 1995–98 మధ్య విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ చదువుకున్న మురళీ పాతికేళ్ల స్నేహ బంధానికి గుర్తుగా ఆదివారం మిత్రులు రూ.రెండు లక్షల నగదును తల్లితండ్రులు జానకమ్మ, కృష్ణమూర్తిలకు అందజేశారు. స్నేహితులు ఎ.సత్యానందం, ఎం.శివకాంత్, ఎస్.విద్యాసాగర్, డి.భగవాన్, కె.మనోజ్, డి.నాగరాజు, ఎస్.తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సబ్–జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం కేఆర్ స్టేడియంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టి నాగభూషణం, ఉపాధ్యక్షుడు, రోటరీ క్లబ్ ముఖ్య ప్రతినిధి పొన్నాడ రవికుమార్, చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జిల్లా జట్లను ఈ నెల 26 నుంచి నరసారావుపేట వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్టు జిల్లా కార్యదర్శి సీహెచ్ ఫల్గుణరావు తెలిపారు. కార్యక్రమంలో సాధు శ్రీనివాసరావు, నీలాద్రి, ఈశ్వరరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పెళ్లయిన రెండు నెలలకే వివాహిత మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మౌనిక (ఫైల్)

జి.సిగడాం: మండలంలోని వెలగాడ పంచాయతీ గొలుసుపూడిపేటకు చెందిన దమ్మ మౌనిక (18) అనే వివాహిత ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం ఖరగ్‌పూర్ చెందిన హైమావతి, వెంకటేష్ దంపతుల కుమార్తె మౌనికకు గొలుసుపూడిపేటకు చెందిన దమ్మ చిన్నారావుతో ఈ ఏడాది ఆగస్టు 18న వివాహం జరిగింది. ఏం జరిగిందో గానీ ఆదివారం మౌనిక తన ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం సీఐ ఆదాం, లావేరు ఎస్ఐ కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీశారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించారు. భర్తతో పాటు అత్త జయమ్మ, మామయ్య వెంకటరావులను విచారించారు. ముగ్గురి సమాధానాల్లోనూ పొంతన లేకపోవడంతో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మౌనిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

సారా స్థావరాలపై విస్తృత దాడులు

- 24వేల లీటర్ల బెల్లంఊట, 220 లీటర్ల సారా ధ్వంసం
- వివరాలు వెల్లడించిన సెబ్ అదనపు ఎస్పీ నాగమణికంఠ





చిన్నబుర్జోలలో సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న సెబ్ అదనపు ఎస్పీ, సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ఆదివారం నాటుసారా స్థావరాలపై అక్కడి పోలీసులతో కలిసి జిల్లా సెబ్ పోలీసులు సంయుక్త దాడులు జరిపారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ (జేడీ) విజయ నాగమణికంఠ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 24 వేల లీటర్ల బెల్లం ఊట, 220 లీటర్ల సారా ధ్వంసం చేశారు. అనధికారికంగా సారా తయారవుతున్న ఒడిషా సరిహద్దు గ్రామాలైన చిన్నబుర్జోల, పెద్దబుర్జోల, దుర్గం, ఏక్మర, మారంగిల్లో ఉన్న స్థావరాలపై దాడులు నిర్వహించారు.

దాడులు ముమ్మరం..

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు మరింత ముమ్మరం చేస్తామని సెబ్ జేడీ విజయనాగమణికంఠ 'సాక్షి'తో తెలిపారు. జిల్లాలో ఆగస్టు నుంచి అక్టోబరు వరకు 216 కేసులు నమోదు చేసి 236 మందిని అరెస్టు చేశామన్నారు. 25,390 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 5322 లీటర్ల నాటుసారాను, 33 వాహనాలను సీజ్ చేశామని వివరించారు. ఒడిశా నుంచి అక్రమ మద్యం రాకుండా దృష్టి పెట్టామని చెప్పారు. మూడు నెలల్లో 78 కేసులు నమోదు చేసి వందమందిని అరెస్టు చేశామని, 28 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. అనధికారికంగా అమ్ముతున్న వారిపై 206 కేసులు నమోదు చేసి 211 మందిని అరెస్టు చేశామని, మూడు వాహనాలు సీజ్ చేశామని వివరించారు.

గంజాయిపై నిఘా..

ఈ మూడు నెలల్లో 36.68 కిలోల గంజాయి పట్టుబడిందని, ఐదు కేసుల్లో పది మందిని అరెస్టు చేశామని అదనపు ఎస్పీ తెలిపారు. అక్రమ ఇసుక తరలింపు కేసులు 44 నమోదు చేసి 47 వాహనాలు సీజ్ చేశామన్నారు. జిల్లాలో కంచిలి మండలం శ్రీరాంపురం, పాతపట్నం, సోంపేట మండలం విక్రంపురం, జనార్దనపురం, జె.నారాయణపురం, ఇచ్ఛాపురం, మామిడిగుడ్డి (మెళియాపుట్టి మండలం), ఇచ్ఛాపురం హైవే, మెళియాపుట్టితో పాటు ఒడిస్సా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని స్థావరాలపై ఆదివారం జరిపిన దాడుల్లో సెబ్ సీఐలు డి.అనిల్‌కుమార్, బి.మురళీధర్, బి.నర్సింహమూర్తి, కె.లక్ష్మినాయుడు, ఎస్ఐలు వి.వేణుగోపాల్, జె.సంధ్యారాణి, కె.కృష్ణారావు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.


వ్యక్తి ఆత్మహత్య



సవర నర్సింహులు మృతదేహం

మెళియాపుట్టి: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై టి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. భావనాపురం కాలనీ చెందిన సవర నర్సింహులు(32) కుటుంబంపై బాధ్యతలేకుండా ఎప్పుడూ భార్య తేజమ్మతో గొడవ పడుతుండేవాడు. ఇంటికి కూడా సరిగ్గా వచ్చే వాడు కాదు. వారం రోజుల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోయి శనివారం ఉదయం రావడంతో భార్య నిలదీయడంతో మళ్లీ వెళ్లిపోయాడు. శనివారం సాయంత్రం కక్కుకుంటూ ఇంటికి వచ్చాడు. వెంటనే పలాసలోని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. తేజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, నర్సింహులు ఏదైనా విషం తాగి ఉండవచ్చని ఎస్సై రాజేష్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుని మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సూర్యమహల్ కూడలి సమీపంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు ఆదివారం మృతి చెందినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. సుమారు 70 ఏళ్ల ఈ వృద్ధుడు మూడు రోజులుగా ఈ పరిసరాల్లోనే తిరుగుతున్నాడని, అతని పరిస్థితి చూసి స్థానికులు భోజనం పెట్టేవారని ఎస్ఐ చెప్పారు. వృద్ధుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం



కాలువలో మృతదేహం

గార: మండలంలోని బలరాంపురం పంచాయతీ కూర్మనాథపురం గ్రామ సమీపంలో సాగునీటి కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కాలువలో నీరు తక్కువ ఉండటంతో ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు నలుపు నిక్కరు, టీ షర్టుతో ఉన్నాడు. సీఐ ఎస్.కామేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.